క్లుప్తంగా

చెత్త శుద్ధి ఇదేనా!



దుడ్డివారి అగ్రహారంలో చెత్త కుప్ప వద్ద పశువు

అమలాపురం టౌన్: పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఇంటింటా చెత్త సేకరణకు ఆటో టిప్పర్లు ఇంకా కొన్ని వీధుల్లో తిరగడం లేదు. ప్లాస్టిక్ వస్తువులు, సంచులు, సీసాలను రోడ్ల కూడళ్లలో పడేయడంతో ఆ చెత్తలోనే పశువులు చేరుతున్నాయి. స్థానిక దుడ్డివారి అగ్రహారంలో ఇళ్ల సముదాయం నడుమ చెత్త కుప్పలు పడి ఉండడం, ఈ కుప్పల్లో పశువులు మేయడం కనిపించింది. ఇదేనా ఇంటింటా చెత్త సేకరణ అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బాలికలు అప్రమత్తతతో మెలగాలి



గొల్లవిల్లి బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

ఉప్పలగుప్తం: బాలికలు సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను అర్థం చేసుకుని అప్రమత్తతతో మెలగాలని ఎస్‌ఐ సీహెచ్ రాజేష్ అన్నారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిల పట్ల జాగ్రత్తలు వహించాలని, ప్రతి ఒక్కరూ గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎస్‌ఐ వివరించారు. వార్డెన్ వై.రోజాపుష్ప తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు లైసెన్స్ తప్పనిసరి



విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: రవాణా శాఖ తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన విద్యార్థుల తల్లిదండ్రులను కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం డీటీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. లేకుంటే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌తో పాటు అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ఫణివర్మ (ఫైల్)

ముమ్మిడివరం: కొత్తలంక గ్రామానికి చెందిన పత్సమట్ల ఫణివర్మ (55) అదృశ్యమయ్యాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అతను ఉదయం నుంచి మురమళ్ల, పశువుల్లంక, శేరుల్లంక గోదావరి పరివాహక ప్రాంతాల్లో సంచరించినట్లు స్థానికులు తెలిపారని కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు ఫణివర్మ అన్నయ్య కుమారుడు నారాయణరాజు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ సేవలు ప్రశంసనీయం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి సేవలు ప్రశంసనీయమని ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ జి.విజయరత్నం అన్నారు. డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా అమలాపురం గ్యారేజ్‌లో సత్కార సభ నిర్వహించారు. కోనసీమ, కాకినాడ జిల్లాల ప్రజా రవాణా అధికారులు రాఘవకుమార్, శ్రీనివాసరావు, విశ్రాంత ప్రజా రవాణా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌కు పితృ వియోగం

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ కాశి భరత్ తండ్రి సూర్యనారాయణ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. సూర్యనారాయణ మృతికి వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు కాశి మునికుమారి, జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్ సంతాపం తెలిపారు. కాశి భరత్‌ను మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, జగడం బాలయ్య, వజ్రపు శరత్, చిన్నారావు, గిడ్డి తిరుపతి వెంకటేశ్వరరావు, సాపే సూర్యప్రకాష్ తదితరులు పరామర్శించారు.

కొలిక్కి వచ్చేనా..!

- రైల్వే రిజర్వేషన్ టిక్కెట్ కౌంటర్ కోసం పోరాటం
- సర్క్యులర్ బజారులో సేవలు పునరుద్ధరించాలని పట్టు

అమలాపురం టౌన్: కోనసీమలో రైలు కూత కొన్నాళ్లకు నెరవేరే అవకాశాలు ఉన్నా, ఈ లోపు అమలాపురం సర్క్యులర్ బజారు (మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్)లో ఉన్న రైల్వే టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేత విషయంపై రెండేళ్ల నుంచీ వివాదాలు సాగుతున్నాయి. జిల్లా ప్రజలకు రైలు సదుపాయం లేకపోవడంతో కనీసం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఉంటే కొంత వెసులుబాటు ఉంటుందని నాటి ఎంపీ, లోకసభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి 2000లో ఈ కౌంటర్‌ను సర్క్యులర్ బజారులో నెలకొల్పారు. 23 ఏళ్లుగా సజావుగా సేవలు అందించిన ఈ కౌంటర్‌ను రెండేళ్ల కిందట ఎత్తివేశారు. 2023 జూన్‌లో సర్క్యులర్ బజారులోని రెండు షాపుల్లో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఎత్తివేసి పట్టణంలోనే హెడ్ పోస్టాఫీస్‌కు రైల్వే శాఖ తరలించింది. పోస్టాఫీస్‌లో ఆదివారం సెలవు దినంలో పనిచేయక, రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే పనిచేసే విధానంపై కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) ఆది నుంచి అభ్యంతరం చెబుతూనే పోరాటాలు చేస్తోంది. పోస్టాఫీస్‌లో ఉన్న రైల్వే కౌంటర్‌ను తిరిగి సర్క్యులర్ బజార్‌కు తీసుకువచ్చి పునరుద్ధరించే దిశగా కేఆర్‌ఎస్‌ఎస్ రెండేళ్ల నుంచి పలు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల అద్దెలు పెంచడం వల్ల తాము రైల్వే కౌంటర్‌ను మార్చామని అప్పట్లో ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఆ



అమలాపురం సర్క్యులర్ బజార్‌లో రైల్వే టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్ (ఫైల్)

రెండు షాపులను రైల్వే కౌంటర్‌కు అద్దె లేకుండా ఇవ్వాలని కేఆర్‌ఎస్‌ఎస్ పట్టుపట్టింది. ఈ విషయంపై న్యాయం కోసం కోర్టును కూడా ఆశ్రయించింది. కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల్లో ఒకరైన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కూడా కౌంటర్‌ను సర్క్యులర్ బజారులో పునరుద్ధరించేందుకు నాటి నుంచి పలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అనేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవదీసి అధికారులను ప్రశ్నించారు. చివరకు కోర్టు మున్సిపాలిటీకి అనుకూలంగా అంటే షాపులకు అద్దెలు వసూలు చేయడం సబబేనని ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ కూడా అందుకు అనుగుణంగా స్పందించింది. ఈ క్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఇటీవల కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఓ లేఖ రాశారు. రిజర్వేషన్ కౌంటర్‌ను పోస్టాఫీస్ నుంచి సర్క్యులర్ బజారుకు తరలించాలన్నది ఆ లేఖ సారాంశం. కేంద్ర మంత్రి కూడా దీనిపై చర్యలు చేపట్టాలని బదులు ఇచ్చారు. ఎంపీ రాసిన లేఖకు కేంద్ర మంత్రి స్పందించినా రాష్ట్ర మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు. మున్సిపాలిటీకి కూడా కేంద్ర మంత్రి కార్యాలయం నుంచి గాని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గాని ఎలాంటి సమాచారం లేదు. దీనిపై మున్సిపల్ అధికారులను 'సాక్షి' సంప్రదించగా ఎంపీ లేఖ, కేంద్ర మంత్రి నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

నామమాత్రపు అద్దెకైనా ఓకే

మొదట్లో సర్క్యులర్ బజారులో రైల్వే కౌంటర్‌కు రెండు షాపులను అద్దె లేకుండా ఇవ్వాలన్న కేఆర్‌ఎస్‌ఎస్ పట్టును కాస్త సడలించుకుని నామమాత్రపు అద్దెకైనా ఇవ్వాలని కోరింది. అయితే ఆ విషయంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ నుంచి సానుకూల సంకేతాలు రాక ఆ అంశం పెండింగ్‌లో పడింది. పొరుగున ఉన్న పుదుచ్చేరి యానాంలో రిజర్వేషన్ కౌంటర్ ఉంది కదా... అమలాపురంలోనూ అలానే కొనసాగించాలని కేఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్ చేసింది. అయితే యానాం మున్సిపాలిటీ తమకు షాపును ఉచితంగా అందజేసిందని రైల్వే శాఖ అధికారులు తెలిపారు. యానాం మాదిరిగానే అమలాపురం మున్సిపాలిటీ కూడా చేయాలని కేఆర్‌ఎస్‌ఎస్ పోరాడింది. రైల్వే కౌంటర్ సర్క్యులర్ బజారులో ఉన్నంత కాలం సెలవు రోజు ఆదివారం సైతం, ఉదయం నుంచి సాయంత్రం వరకూ సేవలు అందించేది. అదే కౌంటర్ పోస్టాఫీస్‌కు వెళ్లాక ఆదివారం సెలవు రోజు పనిచేయడం లేదు. అదీ పని దినాల్లో ఒక పూటే పనిచేయడంపై కోనసీమ ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఈ రైల్వే కౌంటర్‌ను సర్క్యులర్ బజారులోకి ఎప్పటిలాగే మార్చాలన్నది కేఆర్‌ఎస్‌ఎస్, కోనసీమ ప్రజల ఆకాంక్ష.

వరద తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండండి



అధికారులకు వరద పరిస్థితిపై సూచనలు చేస్తున్న డీఆర్‌ఓ మాధవి

ముమ్మిడివరం: గోదావరి వరద ప్రభావం తగ్గే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో కె.మాధవి అధికారులను ఆదేశించారు. శనివారం ముమ్మిడివరం మండలంలో గోదావరి ఉధృతిపై ఆమె అధికారులతో మాట్లాడారు. తాజా వరద హెచ్చరికలకు అనుగుణంగా గోదావరి తగ్గే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయ కార్యక్రమాలను రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, ఫిషరీష్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 8, 9 నెలల గర్భిణులను సమీప పీహెచ్‌సీలకు తరలించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో బోట్లు, లైఫ్ జాకెట్లు వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటికే మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను ఆయా నివాస ప్రాంతాల రేషన్ షాపుల్లో నిల్వ ఉంచామన్నారు. తహసీల్దార్ టి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఏర్పాటు



ఇంటర్మీడియట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులను సత్కరిస్తున్న డీవిఈఓ, నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: జిల్లా ఇంటర్మీడియట్ పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పాటైంది. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పీవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడిగా కోలా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బి.చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ సత్యనారాయణ మూర్తి, సంయుక్త కార్యదర్శిగా గంజి అనంతం, కోశాధికారిగా కేఎస్‌వీఎస్ సాయిరామ్, మహిళా కార్యదర్శిగా జి.ఈశ్వరీదేవి, సలహా కమిటీ సభ్యుడిగా జి.బలభద్రశర్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.కృష్ణమూర్తి, సంసాని వెంకట బంగారం ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ పలు డిమాండ్లపై చర్చించింది. పీఆర్సీ, డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని నూతన కార్యవర్గం డిమాండ్ చేసింది. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులను క్లియర్ చేయాలని సూచించింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అసోసియేషన్ సీనియర్ ప్రతినిధులు పాకా చంద్రరావు, కేపీ జగదీశ్వర రావులను జిల్లా అసోసియేషన్ తరఫున డీఐఈఓ వనుము సోమశేఖరరావు సన్మానించారు.

వేద ఆశీర్వచనంతో భగవంతుని అనుగ్రహం



వీరేశ్వరస్వామి సన్నిధిలో తొలి రోజు వేద ఆశీర్వచనం

ఐ.పోలవరం: వేద ఆశీర్వచనంతో భగవంతుని అనుగ్రహం పొందవచ్చని మురమళ్ల వీరేశ్వర స్వామి దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ తెలిపారు. వీరేశ్వరుని సన్నిధికి వచ్చే భక్తుల కుటుంబ సంక్షేమం ఆకాంక్షిస్తూ ఆలయంలో కొత్తగా వేద ఆశీర్వచనం సేవ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించామన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్దేశించిన రుసుము చెల్లించిన భక్తులకు స్వామివారి దర్శనం, వేద పండితులచే వేద ఆశీర్వచనం ఉంటుందన్నారు. వీరికి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందిస్తామన్నారు. తొలిరోజు 8 మంది భక్తులు వేద ఆశీర్వచనంలో పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టండి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో ఇటీవల వెలుగు చూసిన నకిలీ జనన, మరణ సర్టిఫికెట్ల జారీపై పూర్తి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నకిలీ జనన, మరణ సర్టిఫికెట్ల జారీపై చర్చించింది. ఈ నెల 28న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ సంసాని బులినాని లేవనెత్తిన ఈ అంశంపై మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి కాసులకు కక్కుర్తి పడే సిబ్బందిని, ఏళ్ల తరబడి ఆ విభాగంలోనే తిష్టవేసిన వారిని సాగనంపాలని సమావేశం డిమాండ్ చేసింది. దీర్ఘకాలంగా జనన మరణ విభాగంలో ఉద్యోగాలు చేస్తున్న వారే ఈ అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించింది. నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ వెనుక బలమైన శక్తులు ఉన్నాయని పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. నకిలీ సర్టిఫికెట్ల కారణంగా అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ ప్రతినిధి జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్

దైవభక్తి.. దేశభక్తి



దుడ్డివారి అగ్రహారంలో వినాయక చవితి ఉత్సవ పందిరిలో దేశ నేతల చిత్రపటాలు



కాపులపాలెం వర్తక వీధిలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బాల విద్యార్థి గణపతి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో దేశ నేతల ఫొటోలను పెట్టారు. హిందూ సామ్రాజ్య చక్రవర్తి శివాజీ మహరాజ్, వినాయక నవరాత్రి ఉత్సవాల సృష్టికర్త లోకమాన్య బాల గంగాధర్ తిలక్ చిత్రపటాలు ఏర్పాటు చేశారు. అటు దైవభక్తి, ఇటు దేశభక్తి ఉట్టిపడేలా ఈ ఏర్పాట్లు చేశామని ఆ ఆలయ కమిటీ ప్రతినిధి, అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యర్రమిల్లి నాగసుధా కొండ తెలిపారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

తాళ్లరేవు: స్థానిక కాపులపాలెం వర్తక వీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు కోనంభట్ల సత్తిబాబు శర్మ నేతృత్వంలో గణపతిపూజ, మండపారాధన, పంచామృతాభిషేకాలు తదితర పూజలు జరిపారు. అనంతరం లక్ష్మీగణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. వర్తక సంఘ ప్రతినిధులు, కాపులపాలెం సనాతన సేవా సంఘం ప్రతినిధులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గణేశ ప్రతిమల నిమజ్జనం

అల్లవరం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వాడవాడలా ప్రతిష్ఠించిన గణపతి ప్రతిమలను శనివారం నిమజ్జనం చేశారు. అమలాపురం, అల్లవరం మండలాల నుంచి ఉత్సవ ప్రతిమలను భారీ ఊరేగింపుగా బోడసకుర్రు బ్రిడ్జి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రిడ్జిపై నుంచి వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్సై సంపత్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మణరావు, వీఆర్‌ఓ చిట్టిబాబు తదితరులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ భీమారావు

అమలాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఎంఏకే భీమారావు సూచించారు. శనివారం బండారులంక స్కూల్ కాంప్లెక్స్ సముదాయ సమావేశాన్ని సందర్శించి పాఠశాలల అభ్యాసన స్థాయిలను పెంచాలని, ప్రతి పాఠశాలలో బోధనకు ఉపకరించే ఉపకరణాలు మెండుగా ఉన్నాయని, వాటిని వినియోగించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యా బోధన చేయాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన సాగించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి సరెళ్ల దుర్గాదేవి, పాఠశాల సముదాయ చైర్మన్ ఎస్ఎల్‌వీ బాల, కార్యదర్శి కేఎంవీ గౌడ్, సీఆర్పీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

అమలాపురం రూరల్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పిల్లి సత్యరమేష్ అందించిన సేవలు మరువలేనివని కలెక్టరేట్ ఏఓ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్ ఉద్యోగ విరమణ సత్కార సభ జరిగింది. ఏఓ మాట్లాడుతూ సుమారు 41 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేస్తూ అందరి మన్ననలు పొందారన్నారు.

- 40 ఏళ్లుగా తహసీల్దార్ దార్లలంక ఏసుబాబు రెవెన్యూ శాఖలో క్రమశిక్షణతో పనిచేశారని డీఆర్‌ఓ కె.మాధవి అన్నారు. తహసీల్దార్ ఏసుబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా కలెక్టరేట్‌లో సత్కార సభ జరిగింది. అనంతరం ఏసుబాబు దంపతులను సత్కరించారు. సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

కాట్రేనికోన: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే గుర్తింపు తెస్తాయని ఎంపీపీ కోలాటి సత్యవతి అన్నారు. కాట్రేనికోన గ్రంథి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో గురువారం ఎంపీడీఓ ఎం.వెంకటచలం అధ్యక్షతన మండల పరిషత్ పరిపాలన అధికారి ఎంహెచ్ఎస్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, నల్లా నరసింహమూర్తి, కోలాటి సత్యం పాల్గొన్నారు.



జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్‌ను సత్కరిస్తున్న కలెక్టరేట్ ఏఓ కాశీ విశ్వేశ్వరరావు

లంక గ్రామాల్లో గుబులు



ముక్తేశ్వరం వృద్ధ గౌతమి పాయలో ఉధృతిగా ప్రవహిస్తున్న వరద



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

- మళ్లీ ముంచెత్తుతున్న వరద
- ఆందోళన చెందుతున్న రైతులు

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ధవళేశ్వరం వద్ద గంట గంటకు పెరుగుతున్న వరద తీరంలోని లంక గ్రామాలపై ప్రభావం చూపుతోంది. అప్పనపల్లి కాజ్వేకు రెండు వైపులా శనివారం వరద నీరు చుట్టుముట్టింది. అప్పనపల్లి స్నానాల రేవులో వరద నీరు పోటెత్తడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ భక్తులు స్నానాలు ఆచరించారు. వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మళ్లీ ముంపు బారిన పడే అవకాశం ఉంది. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెదపట్నం మధ్యలంకలోని పసుగ్రాసం, కూరగాయల తోటలు ముంపు బారిన పడ్డాయని రైతులు వాపోయారు. దీంతో పాటు పెదపట్నంలంకలోని కూరగాయల తోటలు సైతం ముంపునకు గురయ్యాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మూడో సారి వరదలు రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆగ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో అక్కడ ప్రజలు పడవలపై వెళ్తున్నారు. పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పశుగ్రాసానికి కొరత ఏర్పడటంతో లంక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పట్టపగలే చోరీ

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామంలో తిరుమాని నాగరాజు దంపతులు శనివారం ఉదయం తమ ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో తమ హోటల్‌లో వ్యాపారం నిమిత్తం వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగల గొట్టి ఇంటిలో ఉన్న సుమారు 15 కాసుల బంగారం, రూ.25 వేల నగదు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

అల్లవరం: ఇటీవల దేవగుప్తంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పెచ్చెట్టి వెంకటేశ్వరరావు (డడేల్) దశదిన కర్మ నిమిత్తం అతని కుటుంబానికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సమకూర్చిన రూ. 89,500 సాయాన్ని మృతుని కుమారుడు నాగేంద్రకు శనివారం అందించారు. తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. శెట్టిబలిజల ఐక్యత కోసం డడేల్ నిరంతరం పోరాటం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు కేతా భానుతేజ, ముషిని రాఘవ, కుడుపూడి బాబు, గొవ్వాల రాజేష్, గుత్తుల చిరంజీవి, దొమ్మేటి రాము, చొల్లంగి సుబ్బిరామ్, జోగి రాజా, గుత్తుల భానుప్రకాష్, దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, యల్లమిల్లి బోసు, రాయుడు విష్ణు, ఇళ్ల ఏడుకొండుల, అప్పారి సూర్యప్రకాష్, పాటి శ్రీరామ్, మట్టపర్తి వాసు, చిట్టూరి పెదబాబు ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, చింతా రామకృష్ణ, తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

మాజీ మంత్రి కన్నబాబుకు పరామర్శ



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమణరావు, కిశోర్

ఉప్పలగుప్తం: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును కాకినాడలోని ఆయన నివాసంలో అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత, గుడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణరావు శనివారం పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి రమణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి తెన్నేటి కిశోర్, భీమనపల్లి సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, ఉప్పలగుప్తం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్, నాయకులు పడమట రాజశేఖర్, మారోజు వినోద్‌కుమార్, పందిరి సుబ్బరాజు, కుంచే సత్యనారాయణ, గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.